సాక్షి
జగిత్యాల
ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



కరుణ చూపేనా?

గ్రామాల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల శిక్షణకాలం పూర్తయ్యింది. పర్మినెంట్ చేస్తారని ఎదురుచూస్తున్నారు. 8లో ▸



కేంద్రం సంస్థలను అమ్ముతోంది

కేంద్రం ప్రభుత్వ సంస్థలను అమ్ముతోందని మంత్రి ఈశ్వర్ అన్నారు. బుగ్గారంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.0/23.0

వాతావరణం

వాతావరణం సాధారణంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఎండ ఉంటుంది. రాత్రి కొంత చలిగా ఉంటుంది. స్వల్పంగా చలిగాలులు వీస్తాయి.

తల్లి ఒడిలో ఉన్నప్పటి నుంచి తనువు చాలించే వరకూ విద్య సముపార్జన చేయండి
– మహ్మద్ ప్రవక్త

	ఇఫ్తార్		సహర్
ఆది	6.34	సోమ	4.37

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయం ఆవరణలో భక్తులు

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. మొన్నటివరకు జయంతి ఉత్సవాలు ఉండగా, ఇప్పుడు మూడురోజులు సెలవులు రావడంతో తాకిడి కొనసాగుతోంది. శనివారం స్వామివారిని దాదాపుగా 15వేల మంది దర్శించుకున్నారు. వాహనాలు అధికసంఖ్యలో రావడంతో పోలీసులు వెంటనే క్లియర్ చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈవో వెంకటేశ్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్, అధికారులు శ్రీనివాసచారి, ధర్మేందర్, శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ధర్మపురికి భక్తుల తాకిడి



ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారి స్వాతి జన్మనక్షత్రం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ముందుగా భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివార్లను దర్శించుకున్నారు.

గొర్రెల పంపిణీ పథకాన్ని వినియోగించుకోండి



మాట్లాడుతున్న గోపాలకృష్ణ

కథలాపూర్(వేములవాడ): రెండో విడత గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నందున యాదవులు వినియోగించుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గోపాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం కథలాపూర్ మండలకేంద్రంలో యాదవసంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గొర్రెల పంపిణీ పథకం నిబంధనల ప్రకారం అర్హులకు అందిస్తామన్నారు. యూనిట్ విలువ రూ.1.75 లక్షలు ఉండగా లబ్ధిదారుడు రూ.43,750 చెల్లించాల్సి ఉంటుందన్నారు. లబ్ధిదారులు తమవాటాను త్వరగా డీడీ రూపంలో చెల్లిస్తే యూనిట్లు త్వరగా మంజూరవుతాయయని తెలిపారు. కథలాపూర్ మండలానికి రెండో విడత 190 యూనిట్లు కేటాయించామని తెలిపారు. పశుసంవర్ధకశాఖ ఏడీ నరేశ్, మండల పశువైద్యాధికారులు అంకం శ్రీనివాస్, దివ్యశ్రీ, మార్కెట్ డైరెక్టర్ సబ్బని గంగు, యాదవసంఘం సభ్యులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ కార్యకర్తలు

జగిత్యాలటౌన్: విభజనహామీలు అమలు చేయాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్ డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనను నిరసిస్తూ శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి జగిత్యాల తహసీల్‌చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్ మాట్లాడుతూ.. 2014 విభజన హామీలు నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. హామీలు నెరవేర్చకుండా కుంటిసాకులు చెప్పడం అన్యాయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తెచ్చిందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రజావ్యతిరేక నిర్ణయాలను మానుకోవాలని హితవు పలికారు.



ఈ యువకుడు ఈద అశోక్. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం హరిపురం స్వగ్రామం. అమ్మానాన్న స్వరూప– మల్లయ్య. అశోక్ బీకాం, ఎంబీఏ పూర్తిచేశాడు. ఎక్కడా ఉద్యోగ అవకాశం రాకపోవడంతో గ్రామంలోనే అమ్మానాన్నకు తోడుగా వ్యవసాయ పనులు చేశాడు. వివాహమై కూతురు పుట్టింది. కుటుంబ పోషణకు గ్రామంలోనే మిషన్ భగీరథలో పనిలో చేరాడు. రూ.13వేల జీతం ఇచ్చేవారు. అవీ ఎప్పుడో వచ్చేవి. కుటుంబ పోషణ కష్టమైంది. ఉద్యోగాల కోసం కంపెనీల వెంట తిరగడం కన్నా రెక్కలకష్టాన్ని నమ్ముకుందామని అనుకున్నాడు. రెండేళ్లక్రితం కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో హమాలీగా చేరాడు. వచ్చే ఆదాయంతో కరీంనగర్‌లో అద్దెకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ‘ఈ రోజుల్లో ఎంత చదివామన్నది ముఖ్యం కాదు. ఏం పనిచేశామన్నది ముఖ్యం. ఉద్యోగమే జీవితం కాదు. కష్టపడితే ఫలితం అదే ఉంటుంది’ అని అశోక్ చెబుతున్నాడు.



ఈయన చిలుకూరి తిరుపతి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల పరిధిలోని యాదవులపల్లె. అమ్మానాన్న మల్లయ్య– ఎల్లవ్వ. ఉన్న ఎకరం వ్యవసాయభూమిని సాగు చేస్తుంటారు. తిరుపతి 2018లో ఎంబీఏ పూర్తి చేశాడు. తరువాత పలు ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేశాడు. ప్రక్రియ ఆలస్యమవడం, తదితర కారణాలతో ఆ ఆలోచన పక్కనపెట్టాడు. కరీంనగర్‌లోని ట్రాన్స్‌పోర్టులో చేరాడు. ఇంతలో వివాహమైంది. కూతురు పుట్టింది. కుటుంబ పోషణకు వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో ఏడాదిక్రితం రైల్వేలో హమాలీగా చేరాడు. ‘హమాలీగా నాకు బస్తాలు మోయడం కొత్త. అయినా ఇష్టంగా మోస్తున్నా. అవకాశాల కోసం ఎదురు చూడడం కన్నా.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే జీవితంలో సంతోషంగా బతుకుతాం’ అంటూ చెప్పాడు తిరుపతి.

సండే స్పెషల్

గ్రాడ్యుయేట్ హమాలీలు





- హమాలీగా ఆసక్తి చూపుతున్న ఉమ్మడి జిల్లా యువత
- ఉద్యోగాలకోసం ఎదురుచూడకుండా స్వయంకృషి వైపు అడుగులు
- సొంతపనిలో సంతోషం ఉందంటున్న ‘లోకల్ బాహుబలి’లు

రక్తాన్ని స్వేదంగా చిందిస్తే కానీ వారి కుటుంబాలకు బుక్కెడు బువ్వ దొరకదు. వందల బస్తాల బరువు మోస్తే కానీ రోజు గడవదు. పొద్దున్నే లేవడం సద్దన్నం తినడం.. ఓ చేతిలో తువాల.. మరోచేతిలో టిఫిన్‌బాక్స్‌తో బయల్దేరి రావడం.. పొద్దంతా ఒళ్లువంచి పనిచేయడం వీరి నిత్యకృత్యం. చేతిలో డిగ్రీ, పీజీ పట్టాలున్నా.. కార్పొరేట్ కంపెనీల చుట్టూ తిరగకుండా.. సర్కారు కొలువే కావాలని ఎదురుచూడకుండా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. శ్రమను ఆయుధంగా మలుచుకుని జీవితంలో సక్సెస్ అవుతున్నారు రైల్వే హమాలీలు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రైల్వేస్టేషన్లలో పనిచేసే హమాలీ కార్మికుల్లో గ్రాడ్యుయేట్లు.. పోస్టు గ్రాడ్యుయేట్లు.. వారి శ్రమైక జీవనంపై సండే స్పెషల్..
– సాక్షి, కరీంనగర్ డెస్క్

ఎక్కువగా యువతే..

హమాలీ పని అంటే రోజంతా బస్తాలు మోయాలి. పొద్దంతా కష్టపడితే.. రాత్రంతా ఒళ్లునొప్పులతో బాధపడుతుంటారు చాలామంది. కొన్నాళ్ల క్రితం 30ఏళ్ల పైబడిన వారే హమాలీ కార్మికులుగా పనిచేసేవాళ్లు. ఏదో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ పనికి వచ్చామని చెప్పుకొచ్చేవారు. ఇప్పుడు కాలం మారింది. ఏసీల్లో కూర్చుని కార్పొరేట్ ఉద్యోగం చేయాలనే ఆలోచన నుంచి పనిఏదైనా సంపాదన ముఖ్యం అనే ఆలోచన యువతలో పెరుగుతోంది. రైల్వేశాఖలో పనిచేసే హమాలీ కార్మికుల్లో ఎక్కువగా యువతే కనిపిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రామగుండం, పెద్దపల్లి, సుల్తానాబాద్, కరీంనగర్, జగిత్యాల, తదితర ప్రాంతాల్లోని రైల్వేస్టేషన్లలో గూడ్స్‌వ్యాగన్ల నుంచి సరుకులు ఎగుమతి, దిగుమతి చేసే హమాలీల్లో 70శాతం మంది యువతే ఉంటున్నారు. ఇందులోనూ సగంమంది వరకు గ్రాడ్యుయేట్లు, పోస్టు గాడ్యుయేట్లు పనిచేస్తున్నారు.

కరీంనగర్‌లో అధికంగా..

కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఉన్న రైల్వేస్టేషన్‌లోని హమాలీల్లో ఎక్కువగా యువతే పనిచేస్తున్నారు. రైల్వేస్టేషన్ పరిధిలో 226 మంది వరకు హమాలీలు ఉండగా.. ఎనిమిది బ్యాచ్‌ల చొప్పున పనిచేస్తున్నారు. ఇందులో 150 మంది వరకు యువతే ఉన్నారు. ఇందులోనూ 60మంది వరకు డిగ్రీలు, పీజీలు చేసినవారే. పెద్దపల్లిలో 100 మంది హమాలీల్లో 30మంది, సుల్తానాబాద్‌లో 50మందిలో 15, జగిత్యాలలో 60మందిలో 10మంది, రామగుండంలో 50మంది వరకు హమాలీలు పట్టభద్రులే. వీరిలోనూ 22 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య ఉన్నవారే అధికంగా ఉన్నారు. డిగ్రీలు, పీజీలు చేసిన తరువాత సమయం వృథా చేయడం, ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరగడం, ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూడడం కన్నా కష్టమైనా ఇష్టంగా పనిచేస్తున్నామని, సొంతంగా పనిచేయడంలో ఆత్మసంతృప్తి, ఆరోగ్యంతో పాటు ఆనందం ఉందని పలువురు యువ బాహుబలిలు చెబుతున్నారు.

ఏడాదిలో తొమ్మిది నెలలు..

రైల్వేస్టేషన్లలో పనిచేసే హమాలీలు ఏడాదిలో దాదాపు తొమ్మిది నెలల పాటు విరామం లేకుండా కష్టపడుతుంటారు. పొద్దున్నే ఎనిమిది గంటల వరకు స్టేషన్‌కు చేరుకోవాలి. అక్కడ హాజరు పట్టికలో పేర్ల నమోదు తరువాత సరుకు ఎగుమతి, దిగుమతి చేస్తుంటారు. బియ్యం, ఎరువులు, గ్రానైట్, సిమెంట్, తదతర సరుకులు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటారు. బయట ఉద్యోగాల కన్నా.. హమాలీ పని చేయడం ద్వారా వచ్చే ఆదాయంలో కుటుంబాన్ని సంతోషంగా పోషించుకుంటున్నామని పలువురు యువ గ్రాడ్యుయేట్ హమాలీలు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ కొలువుకూ ప్రయత్నిస్తున్నా



మాది ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లి. అమ్మానాన్న కొమురయ్య– లక్ష్మి. చెల్లి, తమ్ముడు ఉన్నారు. మాకున్న నాలుగు ఎకరాల భూమిని నాన్న సాగు చేస్తుంటాడు. 2014లో బీకాం కంప్యూటర్స్ పూర్తయ్యింది. ఎంబీఏ మధ్యలో ఆపివేశా. కరీంనగర్‌లో ఉంటూ కానిస్టేబుల్ కోచింగ్‌కు వెళ్లాను. రాత పరీక్షలో 1.5 మార్కులతో ఉద్యోగాన్ని మిస్సయ్యాను. ఇంట్లో ఖాళీగా ఉంటున్నానని తెలిసినవాళ్లు కరీంనగర్‌లోని రైల్వేలో హమాలీగా పని ఇప్పించారు. కొత్తలో కాస్త కష్టమనిపించింది. డిగ్రీ చదివిన నేను హమాలీ చేయడం ఏంటని ఇబ్బంది పడ్డా. తరువాత పనికాదు ముఖ్యం.. పట్టుదల అనిపించింది. హమాలీ పని అలవాటైంది. మూడేళ్లుగా ఇక్కడే చేస్తున్నా. ఇటీవలే వివామైంది. ఈ పని చేసుకుంటూనే మళ్లీ పోలీసు ఉద్యోగానికి సన్నద్ధం అవుతున్నా. ఈవెంట్స్ సాధించాను. పొద్దంతా హమాలీ.. ఇంటికెళ్లాక పుస్తకాలతో కుస్తీ పడుతున్నా.
– మాదరవేని అశోక్, రైల్వే హమాలీ, ర్యాకల్‌దేవ్‌పల్లి

నాన్న పని నేను చేస్తున్నా



మాది రామగుడు మండలం ఒన్నారం. అమ్మానాన్న సత్తవ్వ– కనుకయ్య. నేను బీఎస్సీ(స్టాటస్టిక్స్) 2020లో పూర్తిచేశా. తరువాత మాకు ఉన్న మూడు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ అమ్మానాన్నకు తోడుగా ఉన్నా. పలు ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నం చేశా.. రాలేదు. సమయం వృథా చేయవద్దు అనుకున్నా. నాన్న కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో హమాలీ పని చేసేవాడు. ఇప్పుడు నాన్నకు చేతనైతలేదు. ఇక ఆయన బాధ్యత నేను తీసుకున్నా. ఏడాదిన్నరగా రైల్వేలో హమాలీగా పనిచేస్తున్నా. కొత్తలో కష్టమనిపించింది. ఇప్పుడు అలవాటైంది.
– సతీశ్, రైల్వే హమాలీ, ఒన్నారం

దుబాయ్ పోయి వచ్చిన



మాది మానకొండూర్ మండలం ఖాదర్‌గూడెం. అమ్మానాన్న అరుణ– రమేశ్. మాకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నేను బీకాం పూర్తిచేశా. డిగ్రీ అయిన వెంటనే దుబాయ్ వెళ్లాను. అక్కడ చెఫ్‌గా పనిచేశాను. కరోనా టైంలో అక్కడ ఉండలేని పరిస్థితి. ఇంటికొచ్చాక ప్రయివేటుగా ఉద్యోగం దొరకని దుస్థితి. అప్పటికే మా నాన్న రైల్వేలో హమాలీగా పనిచేస్తున్నారు. 40ఏళ్లుగా ఒక్కడే బస్తాలు మోస్తూ మమ్మల్ని పోషించారు. ఇక ఆయన్ను కష్టపెట్టవద్దు అనుకున్నా. ఆయన బాధ్యతలు నేను తీసుకున్నా. ఏడాదిన్నర హమాలీగా పని చేస్తున్నా. కొత్తలో ఇబ్బందిగా ఉన్నా.. తోటి కార్మికులు తోడుగా నిలిచారు. ఇటీవలే వివాహమైంది. కూలీగా చేస్తున్నా.. కుటుంబాన్ని సంతోషంగా ఉంచుతున్నా.
– జంగ శ్రీకాంత్, రైల్వే హమాలీ, ఖాదర్‌గూడెం

పోలీసులకు సీపీఆర్‌పై అవగాహన

- గుండెపోటు మరణాలను నియంత్రించేందుకు కార్యక్రమం
- ఎస్పీ ఎగ్గడి భాస్కర్




సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: గుండెపోటు మరణాలను నియంత్రించేందుకు, ఆకస్మిక గుండెపోటు నుంచి ప్రజలను రక్షించేందుకు అన్నిస్థాయిలకు చెందిన పోలీసు అధికారులకు సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. శనివారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులకు సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో సీపీఆర్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇటీవల కార్డియా అరెస్టుతో పలువురు యువకులు ఆకస్మిక మృతి చెందడం చాలా బాధాకరం అన్నారు. ఇకపై ఎవరూ చనిపోవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన వచ్చినప్పుడే కార్డియా మరణాలు చాలా వరకు నియంత్రించవచ్చన్నారు. ఆకస్మిక గుండెపోట్లు సంభవించిన సందర్భాల్లో సీపీఆర్ విధానం ద్వారా గుండెకు రక్తప్రసరణం అందడం, నోటిద్వారా ఆక్సిజన్ అందించడం వల్ల గుండె పనిచేయడం ప్రారంభించి ప్రమాదానికి గురైనవారిని రక్షించవచ్చన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండే పోలీసులకు ఆకస్మిక గుండెపోట్లు సంభవించిన వ్యక్తులు తారసపడే అవకాశం ఉన్నదందున, అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు పూర్తిస్థాయిలో శిక్షణ పొందినట్లయితే అలాంటి వ్యక్తుల ప్రాణాలను రక్షించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. గుండెపోటు సంభవించినప్పుడు సీపీఆర్ చేయడం ద్వారా 60 శాతం ప్రాణాన్ని కాపాడవచ్చన్నారు. పోలీస్ సిబ్బంది లో ముఖ్యంగా ట్రాఫిక్ విధులు, బ్లూ కోట్, పెట్రో కార్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సీపీఆర్‌పై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. డీఎస్పీ ప్రకాశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్లు శ్రీకాంత్, రవిశంకర్, ఆర్‌ఐలు వామనమూర్తి, నవీన్, టౌన్ సీఐ కిషోర్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి డిపో మేనేజర్‌గా వేదవతి

మెట్‌పల్లి: మెట్‌పల్లిడిపో మేనేజర్‌గా వేదవతి నియమితులయ్యారు. కొంతకాలంగా మేనేజర్ పోస్టు ఖాళీగా ఉండడంతో కోరుట్ల డీఎం ప్రసూన లక్ష్మి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. రెండురోజుల క్రితం హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ డిపోలో పనిచేస్తున్న వేదవతిని డీఎంగా పదోన్నతి కల్పిస్తూ మెట్‌పల్లికి బదిలీ చేశారు.బాధ్యతలు చేపట్టిన ఆమెకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



18 కేంద్రాలు.. 12,784 మంది హాజరు

- ప్రశాంతంగా ముగిసిన ఎస్ఐ మెయిన్స్
- కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు
- పరీక్ష సమయానికి ముందే కేంద్రాల్లోకి అనుమతి
- సెంటర్లను పరిశీలించిన కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు



తండ్రికి బ్యాగు అప్పగిస్తున్న అభ్యర్థిని



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్ఐ(సివిల్/ఎఆర్/టీఎస్ఎస్పీ/ఎస్పీఎఫ్/ఎస్ఆర్ సీపీఎల్/ఫైర్) అభ్యర్థుల ఎంపిక పక్రియలో భాగంగా రాత పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఎస్ఐ అభ్యర్థుల రాత పరీక్ష కోసం కరీంనగర్, తిమ్మాపూర్, నుస్తులాపూర్‌లో 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు పరీక్ష కొనసాగింది. సీపీ ఎల్.సుబ్బారాయుడు బందోబస్తు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నగరంలోని లాడ్జిలను తనిఖీ చేశారు. అభ్యర్థుల వేలిముద్రలను బయోమెట్రిక్ విధానం ద్వారా పరిశీలించారు. పరీక్ష కేంద్రాల ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లను పరీక్ష ముగిసే వేయించారు. కాగా.. శనివారం జరిగిన పరీక్షకు 12,784 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 94.84 హాజరు శాతం నమోదైంది.

యశోద హాస్పిటల్స్

యశోద మెడికల్ సెంటర్

3-1-397/ఎ, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ ప్రక్కన, అంబేడ్కర్ రోడ్, కరీంనగర్

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది
మెదడు, వెన్నెముక వ్యాధులు : తలనొప్పి, పక్షవాతం, మూర్ఛవ్యాధి, పార్కిన్సన్స్, వెన్ను మరియు మెడనొప్పి, చేతులు, కాళ్ళ తిమ్మిర్లు, నరాల బలహీనత	డా॥ మోహన్ కృష్ణ బొన్నలగడ్డ	11-04-2023 మంగళవారం
కిడ్నీ వ్యాధులు : కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, రోబోటిక్ సర్జరీ, టీఆర్‌ప్రోస్టేట్ యూరాలజీ, ల్యాప్రోస్కోపిక్ యూరాలజీ, ఆండ్రాలజీ & మేల్ ఇన్‌ఫెర్టిలిటీ, మేల్ ఇన్‌ఫెర్టిలిటీ, ఫిమేల్ యూరాలజీ	డా॥ దుర్గ ప్రసాద్ బి	
కార్డియాలజీ వ్యాధులు : పుట్టుకతో వచ్చే గుండెజబ్బులు, హార్ట్ ఎటాక్, అధిక రక్తపోటు, గుండె దడ, ఆయాసం, ఇతర అన్ని రకముల గుండె జబ్బులు కలవారు	డా॥ బి. కార్తీక్ బాబు	
న్యూరో & ఇంటర్వెన్షనల్ రేడియాలజీ వ్యాధులు : మెదడులో రక్తనాళాలు బ్లాక్, రక్తనాళాలు మెలిక పడటం,కాన్పు తరువాత గర్భాశయంలో అధిక రక్తస్రావం, దగ్గినప్పుడురక్తం పడటం, డయాలసిస్ ఫిస్టులా బ్లాక్	డా॥ సురేష్ గిరగాని	12-04-2023 బుధవారం
కిడ్నీ వ్యాధులు : మూత్రపిండాలలో రాళ్ళు, మంట, మూత్ర విసర్జనలో సమస్యలు, అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు	డా॥ రాజశేఖర చక్రవర్తి ఎమ్	
కార్డియాలజీ వ్యాధులు : పుట్టుకతో వచ్చే గుండె జబ్బులు, హార్ట్ ఎటాక్, అధిక రక్తపోటు, గుండె దడ, ఆయాసం, ఇతరుల అన్ని రకముల గుండె జబ్బులు కలవారు	డా॥ ఎ. గురు ప్రకాష్	13-04-2023 గురువారం
అంకాలజీ కన్సల్టేషన్ : రొమ్ము క్యాన్సర్, తల, స్త్రీ జననేంద్రియ క్యాన్సర్లు, మెడ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, ఎముక మృదు కణజాల క్యాన్సర్	డా॥ హరీష్ కంచెర్ల	
కార్డియో థొరాసిక్ సర్జరీ కన్సల్టేషన్: ఊపిరి ఆడకపోవడం, ఛాతిలో నొప్పి, (ఆయాసం), గుండె త్వరగా కొట్టు కోవడం, శస్త్రచికిత్స తీసుకోవడంపై రెండవ అభిప్రాయం, రీడో & అయోర్టిక్ సహా కాంప్లెక్స్ కార్డియాక్ సర్జరీస్, ఎం.ఐ.సి.ఎస్. (మినిమల్లి ఇన్వాసివ్ కార్డియాక్ సర్జరీలు), సర్జరీస్ ఫర్ హార్ట్ ఫెయిల్యూర్	డా॥ విక్రమ్ రెడ్డి	14-04-2023 శుక్రవారం
రేడియేషన్ అంకాలజీ కన్సల్టేషన్ : మానని పుండ్లు, రొమ్ములో కణతులు, గర్భసంచి క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, జీర్ణకోశ క్యాన్సర్, రెక్టమ్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్	డా॥ మహమ్మద్ అబ్దుల్ అజీమ్	15-04-2023 శనివారం

అపాయింట్‌మెంట్ కొరకు: 915 424 6125

క్లుప్తంగా

దుబాయ్‌లో గుండెపోటుతో వలసజీవి మృతి

కోనరావుపేట(వేములవాడ): ఉన్న ఊరిలో ఉపాధి కరువై దుబాయ్ వెళ్లిన ఓ వలసజీవి, అక్కడే గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన బొల్లె శ్రీనివాస్(47) పదేళ్లగా దుబాయ్ వెళ్తున్నాడు. ఆరు నెలల క్రితమే ఇంటికి వచ్చి, మళ్లీ వెళ్లాడు. శనివారం ఉదయం ఫోన్ చేసి, కుటుంబసభ్యులతో మాట్లాడాడు. మధ్యాహ్నం డ్యూటీకి రాలేదని తోటి కార్మికుడు ఫోన్ చేయగా ఎత్తలేదు. గదికి వచ్చి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. గుండెపోటుతో మృతి చెందినట్లు భావించి, కోనరావుపేటలోని కుటుంబసభ్యులకు తెలియజేశాడు. శ్రీనివాస్ మృతి విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య శోభ, కుమారుడు జెస్టిన్, కూతురు జాషువేరి ఉన్నారు. శ్రీనివాస్‌ది నిరుపేద కుటుంబమని, ప్రభుత్వం చొరవ తీసుకొని, మృతదేహాన్ని స్వగ్రామం రప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ..

జమ్మికుంట(హుజూరాబాద్): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపిన వివరాలు.. జమ్మికుంట, బిజిగిరి షరీఫ్ రైల్వే స్టేషన్ మధ్య ట్రాక్‌పై గుర్తు తెలియని రైలు కిందపడి గుర్తు తెలియని 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి శనివారం మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. వంకాయ రంగు ఫుల్‌షర్ట్, గ్రే కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. చామనఛాయ, కోలముఖం, ఎడమ వైపు ఛాతీపై పద్మ అని తెలుగులో పచ్చబొట్టు, కుడి చేతికి వెండిలాంటి కడియం ఉంది. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, మృతుడి ఆచూకీ తెలిసినవారు రామగుండ పోలీసులు, రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి 99493 04574, 94407 00039 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని బీట్‌బజార్ ప్రాంతానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులు తెలిపారు. బాధితురాలు గత గురువారం సాయంత్రం పని నిమిత్తం బయటకు వెళ్లి, ఇంటికి తిరిగి రాలేదన్నారు. కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. సదరు యువతి తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కిశోర్ చెప్పారు. అలాగే గాంధీనగర్ ప్రాంతానికి చెందిన ఓ యువతి శుక్రవారం కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి, వెళ్లిందన్నారు. కళాశాల సమయం ముగిసినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారని తెలిపారు. ఆచూకీ లభించకపోవడంతో బాధితురాలి తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఏరియా ఆసుపత్రి తనిఖీ

హుజూరాబాద్: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని శనివారం కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాజిదా అతహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణి వార్డుల్లో తిరుగుతూ వారి ఆరోగ్య పరిస్థితి, బాలింతలకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం లేబర్ రూమ్, చిన్న పిల్లల క్లినిక్‌లను సందర్శించారు. గర్భిణులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, ఆర్‌ఎంవోలు డాక్టర్ సుధాకర్‌రావు, డాక్టర్ నారాయణరెడ్డి, డివిజన్ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్ పాల్గొన్నారు.

కార్యదర్శులపై కరుణచూపేనా?

- క్రమబద్ధీకరణపై సర్కారు నిర్ణయం ఎలా ఉంటుందో?
- ఆశగా ఎదురుచూస్తున్న జేపీఎస్‌లు
- ఈ నెల 11తో ముగియనున్న ప్రొబేషనరీ పీరియడ్
- జిల్లాలో 288 మంది



ఇటీవల రాష్ట్రస్థాయి అవార్డు పొందిన కలికోట జీపీ కార్యాలయం

కథలాపూర్(వేములవాడ): ప్రభుత్వ ఆదేశాలు, ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ.. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న తమను రెగ్యులరైజ్(క్రమబద్ధీకరణ) చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు. మూడేళ్ల ప్రొబేషనరీ కాలంతో విధుల్లోకి తీసుకున్న సర్కారు దాన్ని మరో ఏడాది పెంచి వేతనాలు పెంచింది. నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం ఈ నెల 11తో ముగియనుండగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని జేపీఎస్(జూనియర్ పంచాయతీ సెక్రటరీ)లు ఆందోళన చెందుతున్నారు. పనిభారం, కొత్త యాప్‌లతో సతమతమవుతున్నప్పటికీ తమకు ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 380 గ్రామాలు..

2019 వరకు నాలుగైదు గ్రామాలకు ఒక్కరే పంచాయతీ కార్యదర్శి ఉండేవారు. కొత్త జీపీలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం జేపీఎస్‌ల నియామకంపై దృష్టిసారించింది. అదే ఏడాది ఏప్రిల్ నెలలో వారు విధుల్లో చేరారు. దీంతో జిల్లాలో 380 గ్రామ పంచాయతీలుండగా 380 మంది కార్యదర్శులున్నారు. ఇందులో 92 మంది సీనియర్, 288 మంది జూనియర్లు. జేపీఎస్‌లకు తొలుత నెలకు రూ.15 వేల వేతనం, మూడేళ్లపాటు ప్రొబేషనరీ కాలంగా అగ్రిమెంట్ రాయించుకున్నారు. ఆ తర్వాత రెగ్యులరైజేషన్ చేస్తామని ప్రభుత్వం పేర్కొంది.

రూ.28,719కి పెరిగిన వేతనం..

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు నూతన పీఆర్సీ ప్రకటించిన సందర్భంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు వేతనాలు పెంచి, ప్రొబేషనరీ కాలం మరో ఏడాది పెంచుతూ జీవో 26 జారీ చేసింది. దీంతో వారి వేతనం రూ. 28,719కి పెరిగింది.

ప్రతీ పనికి జవాబుదారీ..

కొత్త పంచాయతీరాజ్ చట్టం వచ్చిన తర్వాత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల బాధ్యతలు పెరిగాయి. గ్రామాల్లో జరిగే ప్రతీ పనికి వీరే జవాబుదారీగా మారారు. ఇంటిపన్ను వసూళ్లు, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వాహణ, తాగునీటి సరఫరా, రికార్డుల నిర్వహణ, జ్వరాలు, పోడు భూముల సర్వేలు కార్యదర్శులు చేస్తున్నారు. ఇవేకాకుండా పల్లె ప్రగతి, మిషన్ అంత్యోదయ యాప్‌లతో భారం మోపారని వాపోతున్నారు. ఇంత ఒత్తిడి గురవుతున్నప్పటికీ రెగ్యులరైజేషన్ చేస్తారన్న ఆశతో భరిస్తున్నామని అంటున్నారు. ప్రభుత్వం తమపై కరుణచూపి, ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రెగ్యులరైజ్ చేయాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు విధులు నిర్వర్తిస్తున్నాం. నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తయినందున ఇచ్చిన హామీ మేరకు మమ్మల్ని రెగ్యులరైజ్ చేయాలి.

– మోహన్, జేపీఎస్, చింతకుంట, కథలాపూర్ మండలం

ఎక్కువ మంది మహిళలే..



జేపీఎస్‌లలో ఎక్కువ మంది మహిళలే. ఇతర శాఖల్లో ప్రసూతి సెలవులు 180 రోజులుంటాయి. మాకు 120 రోజులే ఇచ్చినప్పటికీ యథావిధిగా విధులు నిర్వర్తించాం. ఉద్యోగ భద్రత కల్పించాలి.

– రవళి, జేపీఎస్, మల్లాపూర్ మండలం

ప్రభుత్వం దృష్టిసారించాలి



జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వం దృష్టిసారించాలి. వారు కష్టపడి పని చేయడం వల్లే ఏటా కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎక్కువ అవార్డులు వస్తున్నాయి. జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి. – హరి అశోక్‌కుమార్, టీ బీసీ ఉద్యోగుల జేఏసీ గౌరవ అధ్యక్షుడు

కేంద్రం ప్రభుత్వ సంస్థలను అమ్ముతోంది


మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్, పక్కన నాయకులు

- సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం దేశానికే ఆదర్శం
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

బుగ్గారం(ధర్మపురి): రాబోయే ఎన్నికల యుద్ధానికి కార్యకర్తలను, నాయకులను సన్నద్ధం చేయడానికే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. శనివారం బుగ్గారం మండల కేంద్రంలోని పోచమ్మ హాల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధిలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లోనూ అతి తక్కువ పింఛన్లు ఇస్తున్నారని తెలిపారు. దశాబ్దాలపాటు దేశాన్ని పాలించిన గత ప్రభుత్వాలు ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ విఫలమయ్యాయని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడిన అనతి కాలంలోనే గణనీయమైన అభివృద్ధి సాధించామని పేర్కొన్నారు. కేంద్రం అనేక ప్రభుత్వ సంస్థలను అమ్ముతోందన్నారు. కార్యకర్తలే తన బలం అని వారు లేకుంటే తాను లేనన్నారు. ఇంత పెద్ద పార్టీలో కొందరు విభిన్న వ్యక్తులు ఉండడం సహజమని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా వాటన్నింటినీ ఛేదించి, రాబోయే ఎన్నికల యుద్ధంలో విజయం సాధించేలా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జగిత్యాల జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, బుగ్గారం జెడ్పీటీసీ సభ్యుడు బాదినేని రాజేందర్, ఎంపీపీ రాజమణి, వైస్ ఎంపీపీ సుచేందర్, సర్పంచ్ మూల సుమలత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గాలిపెల్లి మహేశ్, నాయకులు తాండ్ర సత్యనారాయణరావు, మూల శ్రీనివాస్‌గౌడ్, అబ్దుల్ రహమాన్, కట్ట రాజేందర్, జంగ శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కొన్నిసార్లు అలిగిన మాట వాస్తవమే..

పదవులు తనకు ముఖ్యం కాదని.. తాను ఎన్నడూ పదవుల కోసం పని చేయలేదని బుగ్గారం జెడ్పీటీసీ సభ్యుడు బాదినేని రాజేందర్ అన్నారు. ఆయన తన ప్రసంగంలో పలుమార్లు భావోద్వేగానికి గురయ్యారు. బీఆర్‌ఎస్ పార్టీలోని కొంతమంది నాయకులు తప్పు చేస్తే దాన్ని అందరికీ ఆపాదించడం సరికాదని పేర్కొన్నారు. మున్నూరుకాపు కులపెద్దలు తనను బలవంతం చేయడం వల్లే నాలుగున్నరేళ్లుగా సంఘం జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నానని తెలిపారు. తాను కొన్నిసార్లు అలిగిన మాట వాస్తవమేనని, అది ఎందుకో మంత్రిగారికి తెలుసన్నారు. రాబోయే ఎన్నికల్లో గతంలో కంటే అధిక మెజారిటీ సాధించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

‘డీ–53’ కాలువకు వెయ్యి క్యూసెక్కుల నీరు


తాటిపల్లి వద్ద డీ–53 ప్రధాన కాలువకు నీరు విడుదల చేస్తున్న అధికారులు

- ఈ నెల 10 నుంచి నీటి విడుదల నిలిపివేత
- 15 వరకు ఇవ్వాలని కోరుతున్న రైతులు
- ఎస్సారెస్పీలో 23 టీఎంసీలు నిల్వ

సారంగాపూర్(జగిత్యాల): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని డీ–53 ప్రధాన కాలువకు శుక్రవారం ఉదయం 9 గంటలకు అధికారులు నీటిని విడుదల చేశారు. తాటిపల్లి వద్ద నుంచి కాలువలోకి ప్రస్తుతం వెయ్యి క్యూసెక్కుల నీరు దిగువకు వదిలినట్లు తెలిపారు. అయితే ప్రధాన కాలువ కింద ఈ నెల 20 వరకు నీరందితేనే పంటలు పండుతాయని రైతులు అంటున్నారు. బీర్‌పూర్ రోల్లవాగు ప్రాజెక్టు పరిధిలో ఇది మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మరో రెండు తడులు ఇవ్వాల్సి ఉంటుందని కర్షకులు అంటున్నారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 23 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ ప్రధాన కాలువకు 6,500 క్యూసెక్కులు, పెద్దపల్లి వైపు 5,500 క్యూసెక్కుల నీరు వదిలారు. ఇందులో నుంచి తాటిపల్లి వద్ద డీ–53 ప్రధాన కాలువకు 1000, సరస్వతి కాలువకు 600, లక్ష్మీ కాలువకు 300, అలీసాగర్ లిఫ్ట్‌కు 510, గుత్పా లిఫ్ట్‌కు 270, మిషన్ భగీరథకు 150 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఎవాపరేషన్ కింద 500 క్యూసెక్కులు వెళ్తుందని అధికారులు చెబుతున్నారు.

నీటిని నిలిపివేస్తే పరిస్థితి దయనీయం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు ఈ నెల 10 నుంచి నీటిని నిలిపివేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అదే జరిగితే జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల పరిధిలోని 8 మండలాల రైతుల పరిస్థితి దయనీయంగా మారనుంది. మరో 10 రోజులు నిరంతరంగా నీరు వస్తేనే వరి గింజ గట్టిపడి, దిగుబడి వస్తుందని అంటున్నారు. లేకపోతే 50 శాతానికి పైగా పొలాలు ఎండిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఎన్ని రోజులు నీరు ఇస్తే పంటలు చేతికందుతాయన్న విషయమై వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కొల్వాయి సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు కోరారు.

చికిత్స పొందుతూ సింగిల్‌విండో డైరెక్టర్ మృతి


రాజిరెడ్డి (ఫైల్)

రాయికల్(జగిత్యాల)/మేడిపల్లి(జగిత్యాల): రాయికల్ మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు దుంపల రాజిరెడ్డి(45) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజిరెడ్డి రాయికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం ఆవులకు ఇన్సూరెన్స్ కోసం బైక్‌పై జగిత్యాల వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా మేడిపల్లి మండలంలోని పోరుమల్ల శివారులో మల్యాల మండలంలోని రామన్నపేట్‌కు చెందిన ఆది చిరంజీవి అజాగ్రత్తగా బైక్ నడుపుతూ వచ్చి, ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాజిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం చనిపోయారు. ఆయన మరణవార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి భూమన్న ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధీర్‌రావు పేర్కొన్నారు. సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, ఎంపీటీసీ సభ్యుడు రాజనాల మధుకర్, అసెంబ్లీ కన్వీనర్ మదన్ మోహన్, పట్టణ ఇన్‌చార్జి బోగ శ్రావణిలు రాజిరెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

హనుమాన్ దీక్షాపరుడు..

సారంగాపూర్(జగిత్యాల): కోనాపూర్ శివారు తాతమ్మ చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కలిమి సుధాకర్(36) అనే హనుమాన్ దీక్షాపరుడు తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్టేషన్ హౌస్ అధికారి వెంకటయ్య కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం మున్యాలకు చెందిన సుధాకర్, ఆయన అల్లుడు పోకవేని అజయ్ హనుమాన్ దీక్ష తీసుకున్నారు. ఈ క్రమంలో మాల విరమణ కోసం ఈ నెల 6న బైక్‌పై కొండగట్టు వెళ్తున్నారు. కోనాపూర్ వద్ద పెంబట్ల గ్రామానికి చెందిన చిలుకం నర్సయ్య బైక్‌పై ఎదురుగా అతివేగంగా వచ్చి, ఢీకొట్టడంతో సుధాకర్, అజయ్ తీవ్రంగా గాయపడ్డారు. సుధాకర్‌ను కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

బొమ్మకల్‌కు చెందిన మహిళ..

కరీంనగర్‌రూరల్: అప్పుల బాధతో ఓ మహిళ హెయిర్ డై తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. కరీంనగర్‌రూరల్ పోలీసుల వివరాలు.. బొమ్మకల్‌కు చెందిన గెల్లు రమ(42) భర్త గెల్లు కొమురయ్య రెండేళ్ల క్రితం వీణవంక మండలంలో జరిగిన ప్రమాదంలో మరణించాడు. అప్పటి నుంచి రమ కూలీ పని చేసుకుంటూ కుమారుడు, కూతురును పోషించుకుంటుంది. తన భర్త చనిపోయిన సమయంలో సుమారు రూ.8 లక్షల వరకు అప్పు కావడంతో అప్పు ఎలా తీర్చాలని పలుమార్లు బాధపడేది. తీవ్రమైన మనస్తాపం చెందిన ఆమె శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో హెయిర్ కలర్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందింది. మృతురాలి కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే రామ్‌లు కుటుంబానికి పరామర్శ


రామ్‌లు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే బాజిరెడ్డి

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు కుటుంబాన్ని రాజ్యసభ ఎంపీ సురేష్‌రెడ్డి, నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రామ్‌లు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఆయన సతీమణి, మాజీ ఎమ్మెల్యే జ్యోతి, కుమారులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామ్‌లుతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

యువకుడి ఆత్మహత్య ఘటనలో నలుగురిపై కేసు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని ముచ్చర్ల తండాకు చెందిన భూక్య అజయ్ అనే యువకుడు మలేషియాలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అజయ్ గతేడాది సరిత అనే యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడు. ఇటీవల బతుకుదెరువు నిమిత్తం మలేషియా వెళ్లాడు. సరిత కానిస్టేబుల్ ఉద్యోగానికి కోచింగ్ కోసం సిద్దిపేట వెళ్లింది. ఈ క్రమంలో పది రోజుల క్రితం అజయ్ ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే తన కుమారుడి చావుకు అతని భార్య సరిత, ఆమె తల్లిదండ్రులు, ముచ్చర్ల తండాకే చెందిన రమేశ్ కారణమని మృతుడి తల్లి భూక్య రేణ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నలుగురు నిందితులపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి బలవన్మరణం

సిరిసిల్లక్రైం: మద్యానికి బానిసై, అనారోగ్య సమస్యతో బాధ పడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్లలోని గణేశనగర్‌కు చెందిన కోడం శివ(48) మరమగ్గాలు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. చాలా కాలంగా మద్యానికి బానిసయ్యాడు. గత నాలుగేళ్లుగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. ఇటీవల సమస్య తీవ్రమవడంతో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది, మందులు వాడుతున్నాడు. అయినా ఆరోగ్య పరిస్థితి బాగు పడటం లేదని మనస్తాపానికి గురయ్యాడు. శనివారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కూలి పనికి వెళ్లిన అతని భార్య లావణ్య ఇంటికి వచ్చి చూడగా శివ మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

పేద కుటుంబానికి దాతల సాయం

- ధర్మపురిలో నూతన గృహ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న రమేశ్

ధర్మపురి: తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ నిరుపేద మహిళ కుటుంబానికి దాతలు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. దీంతో నూతన ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురిలోని గంపల వాడకు చెందిన పోచంపెల్లి జమున–లక్ష్మణ్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ పోషణ భారంగా భావించిన లక్ష్మణ్ కొన్నేళ్ల క్రితం భార్యాపిల్లలను వదిలేసి, వెళ్లిపోయాడు. అప్పటినుంచి జమున పొట్టకూటి కోసం కొన్ని ఇళ్లలో పాచి పనులు చేస్తూ పిల్లలను పోషిస్తోంది. ఉండటానికి నీడ లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతోంది.

ఎన్నారై దంపతుల ఔదార్యం..

అమెరికాలో ఉంటున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డి గూడెంకు చెందిన సుంకర ప్రవీణ్–ప్రియ దంపతుల కుమారుడి జన్మదినం సందర్భంగా పేదలకు సాయం చేయాలని భావించారు. వెంటనే ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్‌ను ఫోన్‌లో సంప్రదించి, పేదల వివరాలు తెలపాలని కోరారు. రమేశ్ జమున పరిస్థితిని వివరించి, ఇంటి నిర్మాణం కోసం సాయం చేయాలని కోరగా వారు తమ వంతుగా రూ.1.50 లక్షలు ఇస్తామని ముందుకు వచ్చారు. అలాగే ధర్మపురికే చెందిన మరికొందరు దాతలు తమ వంతుగా కొంత సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రమేశ్ సదరు మహిళ కుటుంబానికి నూతన గృహ నిర్మాణం కోసం శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, వార్డు కౌన్సిలర్ అయ్యోరి వేణుగోపాల్, ఏఎంసీ డైరెక్టర్ బొల్లం హరిప్రసాద్, జక్కు దేవేందర్, రేణికుంట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘రాష్ట్రంపై ప్రధానిది సవతి తల్లి ప్రేమ’


నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కోరుట్ల: మన రాష్ట్రంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నారని సీపీఐ నేత, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు ఆరోపించారు. శనివారం ప్రధాని హైదరాబాద్ పర్యటన సందర్భంగా కోరుట్లలోని సీపీఐ కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణకు రావాల్సిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన హార్టికల్చర్ యూనివర్సిటీలను కేంద్రం మరిచిపోయిందన్నారు. సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ఒక్కొక్కటిగా ప్రైవేటుపరం చేస్తోందని మండిపడ్డారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్నం రాధ, రామిల్ల రాంబాబు, సాంబార్ మహేశ్, సమీర్, అందె వంశీకృష్ణ, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

పంట దిగుబడి రావడం లేదని రైతు ఆత్మహత్య


లింగారావు మృతదేహం

జమ్మికుంట(హుజూరాబాద్): పంట దిగుబడి రావడం లేదని మనోవేదనతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని గండ్రపల్లి గ్రామానికి చెందిన రైతు గండ్ర లింగారావు(47) తనకున్న మూడెకరాలతో పాటు మరో ఆరెకరాలు కౌలుకు తీసుకొని రెండేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. గత ఏడాది పంట దిగుబడి రాక నష్టం వాటిల్లింది. ఈసారి సైతం పంట దిగుబడి వస్తుందో రాదో అని మనోవేదనకు గురయ్యేవాడు. ఈక్రమంలో శనివారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. చాలా సమయం గడిచినా ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో పక్క చేను అతడికి ఫోన్ చేసి పొలం వద్ద ఉన్నాడో లేడో తెలుపాలని కోరింది. అతడు వెళ్లి చూడగా లింగారావు చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. వెంటనే మృతుడి భార్యకు సమాచారం అందించాడు. లింగారావుకు భార్య లక్ష్మి, కూతురు బిందుశ్రీ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు.

ఉరేసుకొని వృద్ధుడు..


శ్రీనివాస్‌రెడ్డి మృతదేహం

రామగిరి(మంథని): బుధవారంపేట (రామయ్యపల్లి)కు చెందిన పెంద్రు శ్రీనివాస్‌రెడ్డి (88) శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాలు.. శ్రీనివాస్‌రెడ్డి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అతడి భార్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. స్థానికంగా ఉంటున్న కొడుకు వద్ద తింటూ ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి భోజనం చేసిన తరువాత కుటుంబ సభ్యులు నిద్రలోకి జారుకున్నారు. వేకువజామున నిద్రలేచిన తర్వాత శ్రీనివాస్‌రెడ్డి ఇంటి నుంచి బయటకు రాలేదని గమనించిన కుటుంబ సభ్యులు తలుపులు నెట్టి చూడగా దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిప్రసాద్ తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా రెజ్లింగ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి రెజ్లింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు తుమ్మల రమేశ్‌రెడ్డి, మహ్మద్ కరీం తెలిపారు. 17 ఏళ్లలోపు బాలబాలికల విభాగంలో పోటీలు నిర్వహిస్తామని, క్రీడాకారులు 2006 నుంచి 2008 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపిక పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఈ నెల 11న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఒరిజినల్ పుట్టిన తేదీ, ఆధార్ కార్డులతో హాజరుకావాలని, పూర్తి వివరాలకు 95733 46352 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
ADMISSIONS

■ Admissions for Guidence GNM/ B.Sc, M.Sc Nursing, B.Pharm, BPT, MPT, BAMS, BHMS, Few Seats Available. Cell: 7013038197, 8367566346, Hyd. [W-785511]

SERVICES
RENT / LEASE

■ వేములవాడ మెయిన్ రోడ్డుకి కోరుట్ల బస్టాండ్ దగ్గర 4 ఫ్లోర్‌లు గల బిల్డింగ్ రెండు వైపుల రోడ్లతో కూడిన బిల్డింగ్ హాస్పిటల్స్, కాలేజీలకు మరియు కమర్షియల్‌కి, షాపింగ్ మాల్స్‌కి అనుకూలం. లిఫ్ట్ సౌకర్యంకలదు. 9177662885, 9391740520 [K-1219805]

WANTED

■ మ్యాన్ పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లో అనుభవమున్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. Contact : Mega Group Man Power & Security. Cell : 70326 10569, 70931 25169. [NA-5483]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785707]

■ Digital Marketing కొరకు Marketing Executives కావలెను సంప్రదించండి. ఫోన్ : 9959484341 [H-778982]

■ కాంట్రాక్టు పద్ధతి లో హాస్పిటల్ లో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ నర్స్, జూ. డాక్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ అ.కా.ను. Sal: 23K-37K ఇంట్రెస్టెడ్ ఉన్నవారు రెజ్యూమ్ వాట్సాప్ చేయగలరు. ఫోన్: 6281159171 [HA-29125]

■ HYDలో అర్జంటుగా సెక్యూరిటీ గార్డ్స్, RTC కార్గో బస్‌లకు బాయ్స్, అటెండర్స్ కావలెను. (కన్సల్టెన్సీ కాదు) మంచి జీతం: వసతి కలదు. సంప్ర: 040-66366664, 9392663777, 9246663777 [HA-1330]

■ గుంటూరు దగ్గర గల ఆఫీసులో ఉండి పనిచేయుటకు టైపింగ్, డ్రైవింగ్ తెలిసిన జూనియర్ లాయర్స్ మరియు డ్రైవర్స్ కావలెను. సంప్రదించండి. ✆ 9666114383/7207007725 [G-779538]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824